క్లుప్తంగా

శతాధిక వృద్ధుడి మృతి



పాబోలు గున్నయ్య (ఫైల్)

ఉండ్రాజవరం: మండలంలోని దమ్మెన్ను గ్రామానికి చెందిన శతాధిక వృద్ధుడు పాబోలు గున్నయ్య (102) శుక్రవారం ఉదయం మృతి చెందారు. ఈయనకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య ఐదేళ్ల క్రితం మరణించింది. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చాక మహాత్మా గాంధీ ప్రజలకు శుభాకాంక్షలు చెప్పేందుకు రైల్లో రాజమండ్రి రాగా, ఆయనను గున్నయ్య కలసి ధన్యవాదాలు చెప్పారు. ఈ విషయాన్ని ఆయన కుటుంబ సభ్యులు విలేకరులకు తెలిపారు. మరణించేంత వరకూ గున్నయ్య ఆరోగ్యంగా జీవించారు. ఆయన మృతి చెందడం కుటుంబ సభ్యులతో పాటు గ్రామానికి కూడా లోటని దమ్మెన్ను సర్పంచ్ గురజర్ల సత్యనారాయణ అన్నారు.

డీ సెట్ అభ్యర్థులకు మరో అవకాశం

నల్లజర్ల: 2023 డీ సెట్ రాసి సీటు రాని అభ్యర్థులకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందని మండలంలోని దూబచర్ల డైట్ ప్రిన్సిపాల్ పీవీ రమణమూర్తి శుక్రవారం తెలిపారు. 2023లో ఇంటర్ పాసై 40 శాతం మార్కులు పొందిన విద్యార్థులు డీ సెట్ రాసి ప్రభుత్వ కళాశాలలో సీటు రానట్టయితే ప్రైవేటు డైట్ కళాశాలలో మేనేజ్‌మెంట్‌కు కేటాయించిన 20 శాతం సీట్లు పొందే అవకాశం ఉందన్నారు. పూర్వపు పశ్చిమగోదావరి జిల్లాలో భీమవరంలోని సీఎస్ఎన్ టీచర్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లో ఈ సదుపాయం ఉందన్నారు. ఇటువంటి అభ్యర్థులు ఈనెల 9 నుంచి14 లోగా కళాశాల యాజమాన్యాన్ని కలవాలన్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు చాగల్లు బాలికలు



విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

చాగల్లు: రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు చాగల్లు జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు ముగ్గురు ఎంపికయ్యారు. ఎం. తేజ, ఎస్.గీత, పి.సాయితేజ ఎంపికైనట్టు హెచ్ఎం పి.వీర్రాజు శుక్రవారం తెలిపారు. ఏలూరులోని సీఆర్ రెడ్డి కాంప్లెక్స్‌లో గురువారం నిర్వహించిన జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ క్రికెట్ పోటీల్లో ఈ ముగ్గురూ మంచి ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు ఆయన వివరించారు. వారికి శిక్షణ ఇచ్చిన వ్యాయమోపాధ్యాయులు మున్ని, విజయలక్ష్మిలను ఉపాధ్యాయులు, పలువురు అభినందించారు.

పార్టీ గెలవాలంటూ పాదయాత్ర



చిన్న తిరుపతికి పాదయాత్ర ప్రారంభించిన వైఎస్సార్ సీపీ ప్రతినిధులు

పెరవలి: రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధించాలని కోరుతూ ఆ పార్టీకి చెందిన 14 మంది మండలంలోని పిట్టల వేమవరం గ్రామం నుంచి చిన తిరుపతికి పాదయాత్ర చేపట్టారు. శుక్రవారం తెల్లవారు జామున వారు పాదయాత్ర ప్రారంభించారు. ఈ పాదయాత్రలో పిట్టల వేమవరం సర్పంచ్ మండ హైమావతి భర్త మండ చిన వెంకట రెడ్డి, క్రికెట్ యూత్ సభ్యులు 13 మంది యాత్రను కొనసాగించారు. అలాగే నిడదవోలు నియోజక వర్గంలో మరలా శ్రీనివాస్ నాయుడు ఎమ్మెల్యేగా గెలుపొందాలని కోరుకుంటామని వారు వివరించారు.

విద్యుత్తు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

నిడదవోలు: ఈపీడీసీఎల్ డిస్కమ్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఈపీడీసీఎల్ డిస్కమ్ కార్యదర్శి తురగా రామకృష్ణ కోరారు. నిడదవోలు డివిజన్ స్థాయి విద్యుత్ ఉద్యోగుల సంక్షేమ సంఘ సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం స్థానిక కాపు కల్యాణ మండపంలో నిర్వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని కేడర్ల ఉద్యోగుల మెరిట్, సీనియారిటీ సమస్యలను పరిష్కరించాలన్నారు. నిడదవోలు డివిజన్ ఈఈ బి. వీరభద్రరావు తన ప్రసంగంలో డివిజన్‌లోని ఉద్యోగుల సమస్యలపై సానుకూలంగా స్పందించారు. జిల్లా అధ్యక్షుడు కె. గోపాలకృష్ణ, కార్యదర్శి ఎం.నిరంజన్, పి. శ్రీను, రవిశంకర్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

పేకాడుతున్న ముగ్గురి అరెస్టు

పెరవలి: మండలంలోని కానూరు విద్యుత్తు సబ్ స్టేషన్ సమీపంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై నిడదవోలు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) పోలీసులు శుక్రవారం దాడి చేశారు. ఈ దాడిలో పేకాడుతున్న ముగ్గురిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.4410 నగదు, నాలుగు మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నామని సెబ్ సీఐ కె.వీరబ్రహ్మం తెలిపారు. కొంతకాలంగా ఇక్కడ పేకాట ఆడుతున్నారని తమకు అందిన సమాచారం మేరకు ఈ దాడి చేశామని ఆయన చెప్పారు. స్వాధీనం చేసుకున్న నగదు, మోటార్ సైకిళ్లను, ముగ్గురు వ్యక్తులను పెరవలి పోలీస్ స్టేషన్‌కు అప్పగించామన్నారు.



గోపాలపురం సురక్ష శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న కలెక్టర్ మాధవీలత



ఉండ్రాజవరం మండలం చివటంలో మందుల కిట్ అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు



పిట్టల వేమవరంలో మందుల కిట్ అందిస్తున్న ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, ఎంపీడీఓ దామోదరరావు



నిడదవోలు మండలం అట్లపాడులో రోగులకు మందుల కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ తదితరులు

సంపూర్ణ ఆరోగ్యానికే సురక్ష

- హోం మంత్రి తానేటి వనిత
- పోచవరంలో సహా పలుచోట్ల వైద్య శిబిరాలు
- వైద్య నిపుణులతో రోగులకు పరీక్షలు
- ఉచితంగా మందుల పంపిణీ

తాళ్లపూడి: రాష్ట్ర ప్రజలందరూ పూర్తి ఆరోగ్యంతో ఉండాలన్న ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. మండలంలోని పోచవరంలో శుక్రవారం ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. మంత్రి వనిత ఈ వైద్య శిబిరాన్ని సందర్శించారు. శిబిరంలో 480 మందికి వైద్యులు అవసరమైన పరీక్షలను నిర్వహించారు. మంత్రి చేతులమీదుగా రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్లు ఏర్పాటు చేసిన పోషకాహార స్టాల్‌ను మంత్రి పరిశీలించారు. అక్కడి పదార్థాలను శిబిరానికి హాజరైన వారికి అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, ఏఎంసీ చైర్మన్ వల్లభశెట్టి శ్రీనివాస్, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోశిన శ్రీలేఖ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాకర్ల వెంటేశ్వరరావు, సర్పంచ్ కాకర్ల హేమలత, ఎంపీడీవో వెంకటరమణ, తహసీల్దార్ టి.రాధిక, వైద్యాధికారులు అన్నపూర్ణ, బీవీవీ దుర్గా భవాని, పి రవికుమార్, సునీల్ పాల్గొన్నారు.

నందిగంపాడులో 324 మందికి..

చాగల్లు: జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరమని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. మండలంలోని నందిగంపాడులో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని మంత్రి వనిత ప్రారంభించారు. ఆయా వైద్య విభాగాలను, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్‌ను ఆమె పరిశీలించారు. ఈ శిబిరంలో 324 ఓపీ సేవలు నమోదయ్యాయి. వీరిలో 11 మందిని మెరుగైన వైద్యం కోసం పెద్దాస్పత్రులకు సిఫారసు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆత్కూరి దొరయ్య, వైఎస్సార్ సీపీ మండలశాఖ అధ్యక్షుడు చెల్లింకుల దుర్గా మల్లేశ్వరరావు, సర్పంచ్ కుదప రాంబాబు, ఎంపీడీవో బి.రాంప్రసాద్, తహసీల్దార్ కె. రాజ్యలక్ష్మి, వైద్యులు కె.నిషిత, అవినాష్, దేవి, సిబ్బంది పాల్గొన్నారు.

చివటంలో 501 మందికి..

ఉండ్రాజవరం: మండలంలోని చివటం గ్రామ సచివాలయం వద్ద పీహెచ్‌సీ వైద్యుడు రాజనాల ప్రసాద్ ఆధ్వర్యంలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు సందర్శించి, వైద్య సేవలను పరిశీలించారు. ఈ శిబిరంలో డాక్టర్ ప్రసాద్ (కంటి), డాక్టర్ వీటీ వర్మ (పిల్లల వైద్యం), డాక్టర్ ఇర్ఫాన్ (జనరల్ మెడిషన్), డాక్టర్ మాధవ ప్రియ (ఈఎన్‌టీ)ల ఆధ్వర్యంలో 501 మందికి వివిధ పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి, సొసైటీ అధ్యక్షుడు కొఠారి సత్యనారాయణ, ఎంపీడీవో గాదిరాజు రామకృష్ణంరాజు పాల్గొన్నారు.

పిట్టల వేమవరంలో 501 మందికి..

పెరవలి: మండలంలోని పిట్టల వేమవరంలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ సందర్శించారు. శిబిరంలో 501 మందికి వైద్యులు వివిధ రకాల పరీక్షలు చేశారు. ఆరోగ్యశ్రీ పథకంలో చికిత్స నిమిత్తం 28 మందిని రిఫర్ చేశామని డాక్టర్ ఏహెచ్ విజయ్‌కుమార్ తెలిపారు. శిబిరంలో గైనకాలజీ, డెంటల్, కంటి, ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు మునిరాజ్ చౌదరి, కె.రామ్మోహనరావు, తేజశ్రీ సేవలు అందించారు. అవసరమైన వారికి ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ చేతుల మీదుగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దామోదరరావు, సర్పంచ్ మండ హైమావతి, సొసైటీ అధ్యక్షుడు మండ తాతారెడ్డి పాల్గొన్నారు.



తాళ్లపూడి మండలం పోచవరంలో రోగులకు మందుల కిట్లు అందిస్తున్న హోం మంత్రి తానేటి వనిత

అట్లపాడులో 374 మందికి..

నిడదవోలు రూరల్: మండలంలోని అట్లపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, జేసీఎస్ మండల కన్వీనర్ వెలగన పోలయ్య ప్రారంభించారు.

మార్కొండపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రవి కుమార్ పర్యవేక్షణలో వైద్య నిపుణులు 374 మంది రోగులను పరీక్షించారు. ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 18 మందిని మెరుగైన వైద్యం కోసం ఉన్నతాసుపత్రులకు రిఫర్ చేశారు. ఎంపీటీసీ సభ్యురాలు కోపల్లె అనంతలక్ష్మి సత్యవతి ఎంపీడీఓ పి.శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

పోతవరంలో 445 మందికి..

నల్లజర్ల: పోతవరం పీహెచ్‌సీ పరిధిలోని చీపురుగూడెంలో నిర్వహించిన వైద్య శిబిరంలో 445 మందికి వైద్యులు పరీక్షలు చేశారు. వారిలో 22 మందిని ఆరోగ్యశ్రీ ఆసుపత్రులకు రిఫర్ చేశారు. శిబిరాన్ని పోతవరం సర్పంచ్ గాలింకి మల్లిక, వైఎస్సార్ సీపీ గ్రామశాఖ అధ్యక్షులు చెల్లు హరిబాబు ప్రారంభించారు. ఎమ్మెల్యే తలారి వెంకట్రావు శిబిరాన్ని సందర్శించి రోగులకు మందులు అందజేశారు.శిబిరంలో ఎండీ జనరల్ జయవర్ధిని, యూరాలజిస్ట్ హరికృష్ణ, గంగాధరరావు, రాజశేఖర్, వెంకట్రావు వైద్యసేవలు అందించారు.

పేదలకు వరం జగనన్న 'సురక్ష '

గోపాలపురం: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు పేదలకు వరం వంటివని జిల్లా కలెక్టర్ కె.మాధవీలత అన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన జగనన్న సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, కలెక్టర్ మాధవీలత ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మాట్లాడుతూ విద్య, వైద్యాలకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. శిబిరంలో సుమారు 370 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కలెక్టర్ కూడా శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. పిల్లలకు, సీజనల్ వ్యాధులతో బాధపడుతున్న వారికి పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గుండె సంబంధిత వ్యాధులున్న 8 మందిని రాజమహేంద్రవరం జీఎస్ఎల్, ప్రభుత్వ ఆసుపత్రులకు రిఫర్ చేశారు.కార్యక్రమంలో డీఅండ్ఎం హెచ్ఓ కె. వెంకటేశ్వరరావు, హుకుంపేట, అన్నదేవరపేట వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- మల్లేశ్వరం గడప గడపకూ..

పెరవలి: జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో రాష్ట్రంలో అర్హత ఉన్న ప్రతి ఒక్క కుటుంబానికీ లబ్ధి చేకూరుతోందని నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు అన్నారు. మండలంలోని మల్లేశ్వరం గ్రామంలో శుక్రవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్లేశ్వరం గ్రామంలో లబ్ధి పొందని గృహమే లేదన్నారు. ప్రతి ఇంటికీ రూ.50 వేల నుంచి రూ.5 లక్షల వరకు లబ్ధి ఈ నాలుగున్నరేళ్లలో చేకూరిందన్నారు. గత ప్రభుత్వాలు మాటలు చెబితే ఈ ప్రభుత్వం చెప్పిన మాటలను నిలుబెట్టుకుందన్నారు. తెలుగుదేశం పాలన అంతా 'దోచుకో-దాచుకో' అన్నట్టుగా ఉండేదని శ్రీనివాస్‌నాయుడు ఆరోపించారు. కానీ ఈ ప్రభుత్వంలో అవినీతికి ఆస్కారం లేకుండా ఆర్థిక ఫలాలను లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు వీరమళ్ళ సత్యనారాయణ, సర్పంచ్ బొలిశెట్టి రత్నమాల, బొలిశెట్టి పట్టాభి, సొసైటీ అధ్యక్షుడు బొలిశెట్టి బ్రహ్మానందం, వివిధ శాఖల అధికారులు, వివిధ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మహిళలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

ఆత్మవిశ్వాసంతో లక్ష్యాల సాధన

- కలెక్టర్ మాధవీలత
- బాలికల గురుకుల పాఠశాల సందర్శన

గోపాలపురం: మనపై మనకు నమ్మకం ఉంటే అనుకున్న లక్ష్యాలను సాధించగలమని జిల్లా కలెక్టర్ కె.మాధవీలత అన్నారు. గోపాలపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడంతో పాటు ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టారన్నారు. వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మాట్లాడుతూ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో విద్య అభ్యసించిన విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించడం అభినందనీయమన్నారు. ఇంగ్లిషులో అనర్గళంగా మాట్లాడిన పాఠశాల విద్యార్థిని జెస్సీకాను అభినందించారు. ఆమెను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ళ భాస్కరరావు, ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీ టీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, నాయకులు కూసం రామమోహన్‌రెడ్డి, ఎస్‌కే వల్లీ, పోతిరెడ్డి నాగరాజు, ముల్లంగి శ్రీనివాసరెడ్డి, యండపల్లి కవిత, ప్రిన్సిపాల్ తాళ్లూరి ఉమాదేవి పాల్గొన్నారు.



అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత, ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

చేసిన మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లండి

- జగనన్నే మళ్లీ రావాల్సిన అవసరం ఉందని చెప్పండి
- గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

ద్వారకాతిరుమల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేసిన మంచి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు సూచించారు. స్థానిక కాపు కల్యాణ మండపంలో వైఎస్సార్ సీపీ గృహ సారథులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో శుక్రవారం నిర్వహించిన 'ఏపీకి జగనే సీఎం ఎందుకు కావాలి' కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలారి మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్నందున పార్టీ శ్రేణులంతా క్రియాశీలకంగా పనిచేసి పార్టీ గెలుపు కోసం పనిచేయాలన్నారు. నాలుగున్నరేళ్లలో జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి, వాటి వల్ల పేదలకు చేకూరిన లబ్ధిని ప్రతి ఇంటికి వెళ్లి వివరించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, వైస్ ఎంపీపీ యలమర్తి దుర్గాదేవి, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అచ్యుత ఏసుబాబు, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, పార్టీ మండల యూత్ అధ్యక్షుడు పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, సొసైటీ ఛైర్‌పర్సన్‌లు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

'మానవత'కు రూ.25 వేల విరాళం

నల్లజర్ల: మానవత సంస్థ మండల శాఖ చేస్తున్న సేవా కార్యక్రమాలను మెచ్చి నల్లజర్లకు చెందిన దుగ్గిన వేణుగోపాలకృష్ణ, చిట్టిరాజు దంపతులు శుక్రవారం ఆ సంస్థకు రూ.25 వేలు విరాళంగా అందజేశారు.ఈ సందర్భంగా మానవత సంస్థ ప్రతినిధులు కండెపు వెంకట సూర్యనారాయణ, ఐడీవీ అప్పారావు, భోగవల్లి వెంకట సుబ్బారావులు ఆ దంపతులకు ధన్యవాదాలు తెలుపుతూ వారిని శాలువాతో సత్కరించారు. సంస్థ సభ్యులు గుత్తికొండ వరప్రసాద్, గుళ్ళపూడి వెంకటరత్నం, ఎస్.రాజేంద్రప్రసాద్, గుండు త్రినాథమూర్తి, ఝూన్సీరాణి తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఖరీఫ్ ధాన్యం సేకరణ

- జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు
- నల్లజర్ల, గోపాలపురాల్లో రైతులతో మైత్రీ సమావేశాలు

నల్లజర్ల: ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు తగిన కార్యాచరణ ప్రణాళిక రూపొందించామని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు చెప్పారు. ఏ దశలోనూ రైతులు మోసపోకుండా పారదర్శకంగా ధాన్యం సేకరణ జరుగుతుందని ఆయనన్నారు. ఖరీఫ్ ధాన్యం కొనుగోలుపై శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేకాధికారి కృష్ణారావు అధ్యక్షతన నిర్వహించిన మైత్రీ కమిటీ సమావేశంలో మాధవరావు మాట్లాడారు. దళారుల ప్రమేయం లేకుండా రైతులు తాము పండించిన ధాన్యాన్ని రైతుభరోసా కేంద్రాల ద్వారా విక్రయించి గిట్టుబాటు ధర పొందాలన్నారు. ధాన్యం సేకరణకు అవసరమైన సిబ్బందిని నియమించామన్నారు. కొనుగోలు కేంద్రాలపై రైతులకు అవగాహన కల్పించేందుకే ఈ తరహా సమావేశాలు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి విజయ భాస్కరరావు, జిల్లా పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజరు కుమార్, తహసీల్దార్ కిశోర్‌కుమార్, ఎంపీడీఓ రాజశేఖర్, ఏవో కమల్‌రాజ్, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ తాడిగడప శ్రీనివాసరావు, నల్లజర్ల, పోతవరం సొసైటీల అధ్యక్షులు కారుమంచి రమేష్ , పెండ్యాల హరేరామకృష్ణ, వైస్ ఎంపీపీ అచ్యుత శివాజీ, గగ్గర శ్రీనివాస్, బంక అప్పారావు, వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం, నల్లజర్ల, పోతవరం డీసీఎంఎస్ సీఈఓలు పాల్గొన్నారు. ధాన్యంలో తేమ శాతంపైనా, గోనె సంచుల పంపిణీపై రైతులు అడిగిన సందేహాలను అధికారులు నివృత్తి చేశారు.



నల్లజర్ల మైత్రీ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

10 నుంచి కొనుగోలు కేంద్రాల ప్రారంభం

గోపాలపురం: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఈనెల 10వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్టు మండల ప్రత్యేకాధికారి కె.సత్యగోవింద్ ప్రకటించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం రైతులతో మైత్రీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యగోవింద్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు సమయంలో ఏ శాఖ సిబ్బంది ఏయే విధులు నిర్వహించాలో వివరించారు. గతేడాది గోనె సంచులు, తేమ శాతం వంటి అంశాలపై వచ్చిన ఆరోపణలు పునరావృతం కాకుండా చూడాలని సూచించారు. ఎంపీడీఓ ఆర్.శ్రీదేవి, ఏవో బి. రాజారావు మైత్రీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చాగల్లు: ఈ ఏడాది రైతుల వద్ద నుంచి ఖరీఫ్ ధాన్యం సేకరణకు సంబంధించి అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ కె.రాజ్యలక్ష్మి, ఎంపీడీవో బి.రాంప్రసాద్ ఆధ్వర్యంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. రైతుల నుంచి ధాన్యం సేకరణ చర్యలను, సేకరణ వివరాలను తెలుసుకొని తగు సూచనలను చేశారు . ఏవో వేణుగోపాల్, రైసు మిల్లర్లు పాల్గొన్నారు.

చివటంలో శ్రీనివాస్‌నాయుడికి సన్మానం

ఉండ్రాజవరం: వాహనమిత్ర పథకం ద్వారా ఆటో డైవర్లకు ఏటా ఆర్థిక సాయం అందించడం ఆంధ్ర ప్రదేశ్ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే సాధ్యమైందని నిడదవోలు ఎమ్మెల్యే జి. శ్రీనివాస్ నాయుడు అన్నారు. వాహనమిత్ర పథకం ద్వారా చివటం గ్రామానికి చెందిన శ్రీఅమ్మ ఆటో యూనియన్ డైవర్లు వరుసగా ఐదో ఏడాది కూడా ఆర్థిక సాయం పొందారు. ఈ క్రమంలో వారు శుక్రవారం చివటం గ్రామంలో ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడి చేతుల మీదుగా కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడిని ఆటో యూనియన్ గౌరవాధ్యక్షుడు పైబోయిన ఏసు బాబు ఘనంగా సత్కరించారు.

కార్యక్రమంలో ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి, సొసైటీ అధ్యక్షుడు కొఠారు సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ యువత మండలశాఖ నాయకుడు గంటిన గణపతి, ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

జగనన్నతోనే అన్ని వర్గాలకూ మేలు

- హోం మంత్రి తానేటి వనిత
- ఐ.పంగిడిలో కొనసాగిన గడప గడపకూ..

కొవ్వూరు: అన్ని వర్గాల ప్రజలకూ మేలు జరగాలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తోనే సాధ్యమని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. అందుకే భవిష్యత్తులో ప్రతి ఒక్కరూ జగనన్నకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. మండలంలోని ఐ.పంగిడి గ్రామంలో శుక్రవారం రాత్రి ఆమె గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మంత్రి వనిత పార్టీ శ్రేణులతో కలసి ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ఆయా కుటుంబాలకు చేకూర్చిన లబ్ధిని వివరించారు. ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు చౌటుపల్లి వీరన్న, ఐ.పంగిడి సర్పంచ్ గోశాల నాగర్జున, ఉప సర్పంచ్ ఉప్పులూరి వెంకట ఫణికృష్ణారావు, జెడ్పీ వైస్ చైర్ పర్సన్ పోసిన శ్రీలేఖ, వైఎస్ ఎంపీపీ వీరమళ్ల నారాయుడు, ఎంపీటీసీ సభ్యులు కోనాల భాణి, కామన రత్నాజీ, మాజీ సర్పంచ్ కోమటి కృష్ణంరాజు, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, నాయకులు ఉప్పులూరి సూరిబాబు, పోసిన శ్రీకృష్ణదేవరాయులు, కంచుమర్తి బాలశంకరం పంతులు పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న హోం మంత్రి వనిత

పశ్చిమ డెల్టాకు 6 వేల క్యూసెక్కుల జలాల విడుదల

నిడదవోలు: రైతుల వ్యవసాయ అవసరాల మేరకు ఉభయ గోదావరి జిల్లాల్లోని మూడు డెల్టాలకు అధికారులు నీటి విడుదలను క్రమబద్ధీకరిస్తున్నారు. నీటి పారుదల శాఖ ధవళేశ్వరం హెడ్‌వర్క్స్ శుక్రవారం అధికారులు డెల్టా కాలువలకు నీటి విడుదలను పెంచారు. పశ్చిమ డెల్టాకు 6,000, మధ్య డెల్టాకు 2,300 క్యూసెక్కులు, తూర్పు డెల్టాకు 4,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. పశ్చిమ డెల్టా పరిధిలో ఏలూరు కాలువకు 933, తణుకు కాలువకు 647, అత్తిలి కాలువకు 525, నరసాపురం కాలువకు 1808, ఉండి కాలువకు 1301 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

8 మద్యం సీసాలతో మహిళ అరెస్టు

తాళ్లపూడి: అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్న బొర్రా కృష్ణకుమారి అనే మహిళను శుక్రవారం మండలంలోని అన్నదేవరపేట గ్రామంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) అధికారులు అరెస్టు చేశారు. ఆమె వద్ద నుంచి ఎనిమిది మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు కొవ్వూరు సెబ్ సీఐ వీటీవీ సత్యనారాయణ తెలిపారు. ఈ దాడిలో సిబ్బంది వై శ్రీనివాస్, బాసంతి, స్వరూప పాల్గొన్నారు.

రీ సర్వే రికార్డులో భూమి కనిపించడం లేదు

తాళ్లపూడి: భూముల రీ సర్వే తర్వాత తమ పొలం రెవెన్యూ రికార్డుల్లో కనిపించడం లేదని మండలంలోని పోచవరం రైతులు వాపోయారు. మొత్తం 22 మంది రైతులకు చెందిన పదెకరాల భూమి రికార్డుల్లో లేదని ఈ గ్రామానికి చెందిన రామారావు, కాకర్ల విష్ణుమూర్తి, చెరుకూరి సత్యనారాయణ తదితరులు తెలిపారు. ఇప్పటికీ ఆ భూమిని తామే సాగు చేసుకుంటున్నామన్నారు. దీనిపై వారు శుక్రవారం పోచవరం గ్రామం వచ్చిన హోం మంత్రి తానేటి వనితకు ఫిర్యాదు చేశారు. లోగడ చింతలపూడి ఎత్తిపోతల పథకం నిర్మాణ సమయంలో తమ భూములు తీసుకుంటామని చెప్పి అలైన్‌మెంట్ మార్చడం వల్ల తమకు అన్యాయం జరిగిందని వారు పేర్కొన్నారు. దీనిపై తాము 2015లో కోర్టును కూడా ఆశ్రయించామని వారు మంత్రికి వివరించారు. తమను న్యాయం జరిగేలా చూడాలని మంత్రికి వారు విన్నవించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని మంత్రి రైతులకు హామీ ఇచ్చారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నిడదవోలు డివిజన్
90102 34548 (కొవ్వూరు)
90100 51493 (నిడదవోలు)
90100 68395 (గోపాలపురం)
Office mail : tpgadvt@gmail.com